క్లుప్తంగా

గుంటూరు వెళ్లి పింఛన్ పంపిణీ



వృద్ధుడు చిన్నవీరాస్వామికి పింఛన్ అందజేస్తున్న వలంటీర్ దొరబాబు

కలిగిరి: మండలంలోని నాగసముద్రం గ్రామానికి చెందిన చిన్నవీరాస్వామి గుంటూరులోని ఒక ప్రైవేట్ వైద్యశాలలో కాలికి శస్త్ర చికిత్స చేయించుకుని చికిత్స పొందుతున్నాడు. వృద్ధాప్య పింఛన్ లబ్ధిదారుడు అయిన వీరాస్వామికి వలంటీర్ బొగ్గవరపు దొరబాబు బుధవారం గుంటూరుకు వెళ్లి అందజేశాడు.

ఇస్కపల్లిలో ముందస్తు సంక్రాంతి సంబరాలు

అల్లూరు: మండలంలోని ఇస్కపల్లిలో ముందస్తు సంక్రాంతి సంబరాల్లో భాగంగా బీఎంఆర్ చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో క్రీడా పోటీలను నిర్వహిస్తున్నారు. 14వ తేదీ భోగి రోజు ఇస్కపల్లిలో ముగ్గుల పోటీలు నిర్వహించి ఆటల పోటీలు, ముగ్గుల పోటీల్లో గెలుపొందిన వారికి రాజ్యసభ సభ్యుడు బీద మస్తాన్‌రావు బహుమతులు ప్రదానం చేస్తారని కార్యనిర్వాహకులు తెలిపారు. 14వ తేదీ భోగి రోజు రాత్రి ఇస్కపల్లిలో మ్యూజికల్ నైట్ నిర్వహిస్తునట్లు తెలియజేశారు.

ముందస్తు సంక్రాంతి వేడుకలు

మర్రిపాడు: మండలంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో బుధవారం ముందస్తు సంక్రాంతి సంబరాలను ఘనంగా నిర్వహించారు. కళాశాల సిబ్బంది విద్యార్థినులకు ముగ్గుల పోటీలను నిర్వహించారు. కార్యక్రమంలో ఎంపీడీఓ నాగమణి, ఎంఈఓ ధనలక్ష్మి, కళాశాల సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

రక్తదానం ప్రాణదానంతో సమానం


• ఆర్డీఓ మధులత



రక్తదానం చేస్తున్న ఆస్పత్రి సూపరింటెండెంట్ శేషారత్నం

ఆత్మకూరు: రక్తదానం చేయడం ప్రతి ఒక్కరి బాధ్యత అని ఆపదలో ఉన్న వారికి ఇది ప్రాణదానంతో సమానమని ఆర్డీఓ కె మధులత అన్నారు. డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ సామాజిక న్యాయ మహాశిల్పం ఆవిష్కరించనున్న నేపథ్యంలో బుధవారం పట్టణంలోని ప్రభుత్వ జిల్లా ఆస్పత్రిలో ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ శేషారత్నం ఆధ్వర్యంలో మెగా రక్తదాన శిబిరం నిర్వహించారు. ఆర్డీఓ మాట్లాడుతూ రక్తదానంపై అవగాహన పెంచుకోవాలని, ముఖ్యంగా యువత రక్తదానం చేయడంలో చొరవ చూపి ముందుండాలన్నారు. ఆరోగ్యవంతమైన వ్యక్తులు మూడు నెలలకోమారు రక్తదానం చేయవచ్చునని సూచించారు. ఆసుపత్రి సూపరింటెండెంట్ శేషారత్నంతో పాటు అర్బన్ డాక్టర్ అస్మా, ఉదయగిరి వైద్యాధికారి, పలువురు అధికారులు రక్తదానం చేసి ఆదర్శంగా నిలిచారు. మొత్తం 65 మంది రక్తదానం చేశారు. ఈ కార్యక్రమంలో ఆస్పత్రి ఆర్ఎంఓ ఉషా సుందరి, మున్సిపల్ కమిషనర్ బి నాగేశ్వరరావు, వైద్యులు, నాయకులు ముజీబ్, వెంకట సుబ్బానాయుడు, కౌన్సిలర్ గంధళ్ల వేణు, రెడ్‌క్రాస్ కార్యదర్శి సాధిక్ హుస్సేన్, స్కూల్ కమిటీ చైర్మన్ మల్లికార్జున పాల్గొన్నారు.


వలంటీర్ల పోస్టులకు ఇంటర్వ్యూలు



ఇంటర్వ్యూ నిర్వహిస్తున్న ఎంపీడీఓ శ్రీదేవి

వరికుంటపాడు: మండలంలో ఖాళీగా ఉన్న వలంటీర్ల పోస్టులకు బుధవారం ఎంపీడీఓ కార్యాలయంలో ఎంపీడీఓ చేవూరి శ్రీదేవి ఇంటర్వ్యూలు నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ మండలంలో 27 వలంటీరు పోస్టులు ఖాళీగా ఉండగా 26 మంది దరఖాస్తు చేసుకున్నారన్నారు. వారిలో 15 మంది హాజరయ్యారన్నారు. ఎంపికైన వారి జాబితా త్వరలో ప్రకటిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో జూనియర్ సహాయకుడు రామకృష్ణారెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

అన్ని ప్రాంతాల్లో సిమెంట్ రోడ్లు



సిమెంటు రోడ్డు పనులు పరిశీలిస్తున్న వైస్ చైర్మన్ శ్రావణ్‌కుమార్, తదితరులు

ఆత్మకూరు: పట్టణంలోని 21వ వార్డులో ప్రజలకు మౌలిక వసతుల కల్పనలో భాగంగా అన్ని ప్రాంతాల్లో సిమెంట్ రోడ్లు నిర్మిస్తున్నట్లు మున్సిపల్ వైస్ చైర్మన్ డాక్టర్ కేవీ శ్రావణ్‌కుమార్ అన్నారు. 21వ వార్డు పరిధి ఉలవదిబ్బలో సచివాలయం నిధులు రూ.4.50 లక్షలతో మంజూరైన సిమెంట్ రోడ్డు పనులను బుధవారం ఆయన పరిశీలించారు. గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో ఎమ్మెల్యే మేకపాటి విక్రమ్‌రెడ్డి దృష్టికి స్థానికులు రోడ్డు విషయాన్ని తీసుకొచ్చారన్నారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకుడు చిన్నపరెడ్డితో పాటు స్థానిక ముస్లిం మత పెద్దలు పాల్గొన్నారు.

ఆడుదాం.. ఉత్సాహంగా..

• మండల స్థాయిలో కోలాహలంగా ఆడుదాం ఆంధ్రా పోటీలు ప్రారంభం



ఆత్మకూరు: క్రికెట్ క్రీడలకు ముందు టాస్ వేస్తున్న ఎంపీపీ వేణుగోపాల్‌రెడ్డి

ఆత్మకూరు: తొలి దశలో సచివాలయం స్థాయిలో జరిగిన ఆడుదాం ఆంధ్రా పోటీల్లో విజేత జట్లకు మండల స్థాయిలో బుధవారం ప్రారంభయ్యాయి. పట్టణంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో, ఎస్ఆర్‌జేడీ కళాశాలలో క్రికెట్ పోటీలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీపీ కేతా వేణుగోపాల్‌రెడ్డి మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం గ్రామీణ స్థాయి క్రీడాకారులను జిల్లా, రాష్ట్ర స్థాయికి ఎదిగేలా చేసేందుకు ఆడుదాం ఆంధ్రా కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ప్రభుత్వమే అన్ని క్రీడా పరికరాలు, వసతులు ఏర్పాటు చేసి నిర్వహిస్తున్న ఈ క్రీడలను యువత సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఉన్నత పాఠశాలలో జరిగిన క్రికెట్ పోటీల్లో నువ్వూరుపాడు, ఆత్మకూరు ఏసీఎస్ఆర్ కాలనీ జట్ల మధ్య పోటీతో టోర్నమెంట్ ప్రారంభించారు. ఎస్ఆర్‌జేడీ కళాశాలలో జరిగిన పోటీల్లో వివిధ సచివాలయాల జట్ల మధ్య ఉత్సాహంగా పోటీలు సాగాయి. చివరకు కరటంపాడు యువత జట్టు విజయం సాధించింది. పోటీలు గురు, శుక్రవారాల్లోనూ జరగనున్నట్లు ఎంపీడీఓ ఐజాక్ ప్రవీణ్ తెలిపారు. ఈ కార్యక్రమంలో శాప్ డైరెక్టర్ కాలువ నరసింహులు, వివిధ పాఠశాలల పీఈటీలు తిరుపతయ్య, షరీఫ్, కృష్ణయ్య, పంచాయతీ కార్యదర్శి భాస్కర్, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

మండల స్థాయి క్రీడలు ప్రారంభం

సంగం: స్థానిక జెడ్పీ ఉన్నత పాఠశాలలో బుధవారం ఎంపీడీఓ గోపీ ఆధ్వర్యంలో ఆడుదాం ఆంధ్రా మండల స్థాయి క్రీడా పోటీలను ప్రారంభించారు. తొలుత వాలీబాల్ క్రీడాకారులకు అభినందనలు తెలిపారు. వాలీబాల్ ఆటను ఆడి క్రీడాకారుల్లో ఉత్సాహం నింపారు. గ్రామీణ ప్రాంత క్రీడాకారులను ప్రోత్సహించే లక్ష్యంతో రాష్ట్ర ప్రభుత్వం ఆడుదాం ఆంధ్రా కార్యక్రమాన్ని చేపట్టిందన్నారు. ఈ కార్యక్రమంలో ఎంఈఓలు జానకిరాం, మల్లయ్య, పీడీలు, సచివాలయ కార్యదర్శులు సిబ్బంది పాల్గొన్నారు.

సందడిగా 'ఆడుదాం ఆంధ్రా' పోటీలు

బిట్రగుంట: బిట్రగుంటలోని రైల్వే మైదానంలో ఆడుదాం ఆంధ్రా మండల స్థాయి క్రీడా పోటీలు బుధవారం అట్టహాసంగా ప్రారంభమయ్యాయి. కావలి ఆర్డీఓ వీకే శీనానాయక్, మండల ప్రత్యేకాధికారి పరిమళ ముఖ్య అతిథులుగా హాజరై క్రీడలను ప్రారంభించారు. వివిధ గ్రామాల నుంచి వచ్చిన క్రీడాకారులు ఉత్సాహంగా క్రీడల్లో పాల్గొని సందడి చేశారు. ఆర్డీఓ వీకే శీనానాయక్ మాట్లాడుతూ గ్రామీణ క్రీడలకు, క్రీడాకారులను ప్రోత్సహించే దిశగా ప్రభుత్వం నిర్వహిస్తున్న ఆడుదాం ఆంధ్రా పోటీలను క్రీడాకారులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో తహసీల్దార్ హేమంత్‌కుమార్, ఎంపీడీఓ వెంకటసుబ్బారావు, ఎంఈఓ నరసింహారావు, వ్యాయామ ఉపాధ్యాయులు, సచివాలయ సిబ్బంది, వలంటీర్లు, తదితరులు పాల్గొన్నారు.

కోలాహలంగా క్రీడా పోటీలు

కొండాపురం: ఆడుదాం ఆంధ్రా మండల స్థాయి క్రీడా పోటీలు బుధవారం నుంచి కోలాహలంగా ప్రారంభమయ్యాయి. ఎంపీడీఓ ఆర్.బ్రహ్మయ్య క్రీడలను పారంభించారు. మండలంలోని 13 సచివాలయాల నుంచి 26 జట్ల బ్యాడ్మింటన్ క్రీడా జట్లు పాల్గొన్నాయి. మొత్తం 52 మంది క్రీడాకారులు ఆటల పోటీల్లో పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో వ్యాయామ ఉపాధ్యాయులు శ్రీనివాసులు, రాఘవరావు, పంచాయతీ కార్యదర్శులు సీహెచ్ ప్రదీప్, చెన్నకేశవులు తదతరులు పాల్గొన్నారు.

అట్టహాసంగా ఆడుదాం ఆంధ్రా పోటీలు

జలదంకి: మండలంలోని జలదంకి ఉన్నత పాఠశాల క్రీడా మైదానంలో బుధవారం ఆడుదాం ఆంధ్రా పోటీలు అట్టహాసంగా ప్రారంభమయ్యాయి. వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు పాలవల్లి మాలకొండారెడ్డి ప్రారంభించారు. వాలీబాల్, షటిల్ పోటీలు మండల స్థాయిలో నిర్వహిస్తున్నారు. వాలీబాల్ పోటీల్లో మండల స్థాయి విజేతగా జలదంకి-2 సచివాలయం జట్టు, షటిల్ పోటీల్లో సోమవరప్పాడు సచివాలయం జట్టు విజేతలుగా నిలిచాయని ఎంపీడీఓ బత్తిన సింగయ్య తెలిపారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ ఏవీ రమణారావు, ఎంఈఓ శ్రీధర్, వైఎస్సార్‌సీపీ జిల్లా ప్రచార కార్యదర్శి ఇస్కా మదన్‌మోహన్‌రెడ్డి, జేసీఎస్ కన్వీనర్ తిప్పారెడ్డి ఇందిరమ్మ, మండల బూత్ కమిటీల అధ్యక్షుడు సురె వెంకట శేషారెడ్డి, పాఠశాల హెచ్‌ఎం కొండారెడ్డి, వ్యాయామ ఉపాధ్యాయులు, క్రీడాకారులు పాల్గొన్నారు.

క్రీడలతో మానసికోల్లాసం

ఉదయగిరి: క్రీడలతో మానసికోల్లాసం కలుగుతుందని జిల్లా సోషల్ వెల్ఫేర్ ఆఫీసర్, జోనల్ నోడల్ అధికారి వెంకటయ్యఅన్నారు. ఆయన బుధవారం ఉదయగిరిలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాల, ఎంఆర్ఆర్ డిగ్రీ కళాశాల క్రీడా ప్రాంగణంలో ఆడుదాం ఆంధ్రా మండల స్థాయి క్రీడా పోటీలను ప్రారంభించి మాట్లాడారు. గ్రామీణ క్రీడాకారుల్లో ఉన్న క్రీడా ప్రతిభను వెలికి తీసేందుకు ఈ పోటీలు ఎంతో దోహదపడతాయన్నారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ పి.సామ్రాజ్యం, జెడ్పీ కో-ఆప్షన్ సభ్యుడు గాజుల తాజుద్దీన్, ఎంపీడీఓ డీ.ఈశ్వరమ్మ, ఎంఈఓ టి.శ్రీనివాసులు, కళాశాల వైస్ ప్రిన్సిపల్ నరసింహులు, నాయకుడు ఎం.లక్ష్మయ్య, తదితరులు పాల్గొన్నారు.



మర్రిపాడు: పోటీలను ప్రారంభిస్తున్న నాయకులు

ఆడుదాం ఆంధ్రాతో క్రీడాకారులకు ప్రత్యేక గుర్తింపు

వరికుంటపాడు: రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న ఆడుదాం ఆంధ్రా క్రీడా పోటీల ద్వారా క్రీడాకారులకు ప్రత్యేక గుర్తింపు వస్తోందని మండల ప్రత్యేకాధికారి తిరుపాల్‌రెడ్డి అన్నారు. ఆయన బుధవారం ఎంపీడీఓ కార్యాలయ సమీపంలోని క్రీడా మైదానంలో మండల స్థాయి క్రీడా పోటీలను ప్రారంభించారు. గ్రామీణ ప్రాంతాల్లోని క్రీడాకారులను గుర్తించి వారిలోని క్రీడా నైపుణ్యాన్ని ప్రోత్సహించేందుకు ఈ పోటీలను ప్రభుత్వం నిర్వహిస్తున్నదన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీఓ చేవూరి శ్రీదేవి సొసైటీ అధ్యక్షుడు జి.రామాంజనేయులు, డైరెక్టర్ జక్కం శ్రీనివాసులురెడ్డి, సర్పంచ్‌లు దిలీప్‌కుమార్, సుబ్బారెడ్డి, మాజీ ఏఎంసీ చైర్మన్ ఆలీఅహ్మద్ నాయకుడు ఎం.తిరుపతినాయుడు తదితరులు పాల్గొన్నారు.

ఉత్కంఠ భరితంగా క్రికెట్ పోటీలు

చేజర్ల: ఆడుదాం ఆంధ్రా మండలస్థాయి క్రికెట్ మ్యాచ్‌లు బుధవారం ప్రారంభమయ్యాయి. మండలంలోని ఆదూరుపల్లి, పాతపాడు టీమ్‌ల మధ్య పోటీలు ఉత్కంఠ భరితంగా సాగాయి. ఆదూరుపల్లిలో యనమదల, నాగులవెలటూరు, పాడేరు, మడపల్లి, పాతపాడులో నెర్నూరు, చేజర్ల, తూర్పుపల్లి, కోటితీర్థం జట్ల మధ్య మ్యాచ్‌లు ఉత్సాహంగా జరిగాయి. ఈ కార్యక్రమంలో ఎంఈఓ-2 మస్తానయ్య, పంచాయతీ సెక్రటరీలు రత్నమ్మ, మహేష్, ఓబులాయపల్లి సర్పంచ్, వైస్ ప్రెసిడెంట్, మండల స్పోర్ట్స్ కో ఆర్డినేటర్ మల్లికార్జున పాల్గొన్నారు.



జలదంకి: పోటీలను ప్రారంభిస్తున్న వైఎస్సార్ సీపీ నేత మాలకొండారెడ్డి, అధికారులు



ఉదయగిరి: మాట్లాడుతున్న వెంకటయ్య



చేజర్ల: పాతపాడులో క్రికెట్ పోటీలు ప్రారంభిస్తున్న అధికారులు

మండల స్థాయి క్రికెట్ పోటీలు

మర్రిపాడు: ఆడుదాం ఆంధ్రా క్రీడా పోటీల్లో భాగంగా బుధవారం మండల స్థాయి క్రికెట్ పోటీలను నిర్వహించారు. అల్లంపాడు జట్టుపై పెగళ్లపాడు జట్టు విజయం సాధించగా, పెగళ్లపాడు జట్టుపై పడమటినాయుడుపల్లి జట్టు విజయం సాధించింది. ఈ కార్యక్రమాల్లో వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు బొర్రా సుబ్బిరెడ్డి, మాజీ కన్వీనర్ గంగవరపు శ్రీనివాసులునాయుడు, జిల్లా మైనార్టీ సెల్ సెక్రటరీ షేక్ మౌలాలి, ఎంపీడీఓ నాగమణి, ఎంఈఓ ధనలక్ష్మి పాల్గొన్నారు.

క్రీడాకారులకు వరం.. ఆడుదాం ఆంధ్రా

• ఎమ్మెల్యే రామిరెడ్డి ప్రతాప్‌కుమార్‌రెడ్డి



కావలి: పోటీలను ప్రారంభించి మాట్లాడుతున్న ఎమ్మెల్యే ప్రతాప్ కుమార్ రెడ్డి

కావలి: గ్రామీణ క్రీడలకు, క్రీడాకారులకు ప్రోత్సాహం అందించే దిశగా ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న ఆడుదాం ఆంధ్రా క్రీడా పోటీలను ప్రతి క్రీడాకారుడు సద్వినియోగం చేసుకోవాలని కావలి ఎమ్మెల్యే రామిరెడ్డి ప్రతాప్‌కుమార్‌రెడ్డి అన్నారు. పట్టణంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల క్రీడా మైదానంలో మండల స్థాయి ఆడుదాం ఆంధ్రా క్రీడా పోటీలను ఎమ్మెల్యే బుధవారం ప్రారంభించారు. ఎమ్మెల్యే ప్రతాప్‌కుమార్‌రెడ్డి మాట్లాడుతూ గ్రామీణ క్రీడలకు పూర్వ వైభవం తీసుకువచ్చేలా, యువతలో క్రీడాసక్తిని పెంపొందించేలా ప్రభుత్వం ఆడుదాం ఆంధ్రా కార్యక్రమానికి శ్రీకారం చుట్టిందన్నారు. ఈ కార్యక్రమం ద్వారా గ్రామీణ క్రీడలతో పాటు యువత, విద్యార్థుల్లో క్రీడలపై ఆసక్తిని పెంపొందించి ప్రతిభ కలిగిన క్రీడాకారులను తయారు చేయవచ్చన్నారు. క్రీడల్లో ప్రతిభ కలిగిన క్రీడాకారులకు ప్రభుత్వం నుంచి మరింత ప్రోత్సాహం అందించడం జరుగుతుందని తెలిపారు. కార్యక్రమంలో వివిధ శాఖల అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

క్రీడలతో మానసికోల్లాసం

• మేకపాటి రాజగోపాల్‌రెడ్డి

దుత్తలూరు: క్రీడలతో మానసికోల్లాసం కలుగుతుందని ఉదయగిరి నియోజకవర్గ వైఎస్సార్‌సీపీ సమన్వయకర్త మేకపాటి రాజగోపాల్‌రెడ్డి అన్నారు. ఆయన బుధవారం దుత్తలూరు ఏపీ మోడల్ పాఠశాలలో మండల స్థాయి అడుదాం ఆంధ్రా పోటీలను ప్రారంభించారు. ఆయన క్రీడాకారులను పరిచయం చేసుకుని మంచి ప్రతిభ చాటాలని ఆకాంక్షించారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి గ్రామీణ క్రీడాకారుల ప్రతిభను వెలుగులోకి తెచ్చేందుకు ఈ కార్యక్రమం చేపట్టారన్నారు. మంచి ప్రతిభ చాటి రాష్ట్ర స్థాయికి ఎంపికై ఉదయగిరి నియోజకవర్గానికి మంచి పేరు తీసుకురావాలన్నారు. ఈ కార్యక్రమంలో మండల ప్రత్యేకాధికారి వెంకటయ్య, ఆడుదాం ఆంధ్రా ప్రత్యేకాధికారి ఎస్కే ఆజాద్, ఎంపీడీఓ సాయిప్రసాద్, జేసీఎస్ మండల కన్వీనరు అన్నంరెడ్డి వెంకటేశ్వర్లురెడ్డి, జిల్లా ఎగ్జిక్యూటివ్ మెంబరు దొంతిరెడ్డి నరసింహారెడ్డి, సీనియర్ నాయకులు ఎల్‌పీ కొండారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ప్రతిష్టాత్మకంగా ఆడుదాం ఆంధ్రా

వింజమూరు(ఉదయగిరి): ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ఆడుదాం ఆంధ్రా కార్యక్రమాన్ని నిర్వహిస్తోందని, క్రీడాకారులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకుని మరింతగా ఉన్నతంగా ఎదగాలని సమన్వయకర్త మేకపాటి రాజగోపాల్‌రెడ్డి చెప్పారు. వింజమూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో బుధవారం రాజగోపాల్‌రెడ్డి ఆడుదాం ఆంధ్రా మండల స్థాయి పోటీలను ప్రారంభించారు. ఇదే పాఠశాలలో విద్యార్థులకు విజయదీపిక పుస్తకాలు పంపిణీ చేశారు. అనంతరం భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో జెడ్పీటీసీ గణపం బాలకృష్ణారెడ్డి, మండల అధ్యక్షుడు రేవునూరు శ్రీనివాసులురెడ్డి, సర్పంచ్ సుజన, సొసైటీ డైరెక్టర్లు అనంగి రాజేష్, పోలుబోయిన వెంకటేశ్వర్లు, వైఎస్సార్‌సీపీ నేతలు గణపం రమేష్‌రెడ్డి, అంకినపల్లి ఓబుల్‌రెడ్డి ఎంపీడీఓ రాజేష్‌బాబు, మండల ఉపాధ్యక్షుడు అనంగి రమణయ్య తదితరులు పాల్గొన్నారు.



క్రీడాకారులతో మాట్లాడుతున్న రాజగోపాల్‌రెడ్డి



వింజమూరులో క్రీడాకారులను పరిచయం చేసుకుంటున్న రాజగోపాల్‌రెడ్డి

అంగన్‌వాడీలకు షోకాజ్ నోటీసులు జారీ చేయండి

ఉదయగిరి: మండలంలో 28 రోజులుగా సమ్మె చేస్తున్న అంగన్‌వాడీ కార్యకర్తలు, ఆయాలకు మహిళా పోలీసులు, వీఆర్వోలు ప్రభుత్వ ఆదేశాల మేరకు షోకాజ్ నోటీసులు జారీ చేయాలని తహసీల్దార్ సానా శ్రీనివాసులురెడ్డి తెలిపారు. ఆయన బుధవారం తన కార్యాలయంలో వీఆర్వోలు, సచివాలయ సిబ్బంది, మహిళా పోలీసులతో సమావేశం నిర్వహించారు. తహసీల్దార్ మాట్లాడుతూ సమ్మె చేస్తున్న వారికి సచివాలయ సిబ్బంది షోకాజ్ నోటీసులు జారీ ప్రక్రియ మంగళవారం నుంచి చేపట్టామన్నారు. అంగన్‌వాడీ కార్యకర్తలు నోటీసులు తిరస్కరించినట్లయితే ప్రభుత్వం తీసుకునే చర్యలకు బాధ్యత వహించాల్సి ఉంటుందన్నారు. నోటీసులు తీసుకున్న కార్యకర్తలు నిర్ణీత సమయంలోగా వివరణ ఇవ్వాల్సి ఉంటుందన్నారు. మండలంలో వంద మంది కార్యకర్తలు, ఆయాలు సమ్మె చేస్తున్నారని, ఇప్పటి వరకు 43 మందికి నోటీసులు జారీ చేశామని, మిగిలిన వారికి కూడా జారీ చేస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో అంగన్‌వాడీ సూపర్‌వైజర్ తేజస్విని తదితరులు పాల్గొన్నారు.



గండిపాళెం అంగన్‌వాడీ కేంద్రంలో గోడకు నోటీసులు అంటించిన వీఆర్వో

నోటీసుల జారీ ప్రక్రియ ప్రారంభం

మండలంలో సమ్మెలో పాల్గొన్న అంగన్‌వాడీ కార్యకర్తలు, ఆయాలకు బుధవారం వీఆర్వోలు నోటీసుల జారీ ప్రక్రియ చేపట్టారు. గండిపాళెం వీఆర్వో బిల్లుపాటి వెంకటేశ్వర్లు, గండిపాళెం, వెంగళరావునగర్ కార్యకర్తలు, ఆయాలు సమ్మెలో పాల్గొని ఉండడంతో వారికి షోకాజ్ నోటీసులు జారీ చేయబోగా వారు తిరస్కరించారు. దీంతో ఆయన అంగన్‌వాడీ కేంద్రంలో, కార్యకర్తలు, ఆయాల ఇంటి వద్ద గోడలకు నోటీసులు అంటించారు.

పోలేరమ్మ జాతరకు పోటెత్తిన భక్తులు

కావలి: కావలి గ్రామదేవత నడివీధి పోలేరమ్మ జాతరకు భక్తులు బుధవారం పోటెత్తారు. పాతూరు పోలేరమ్మకు విశిష్ట ప్రాధాన్యం ఉండడంతో భక్తులు అమ్మవారి మహిమలు, విశిష్టతను గుర్తు చేసుకుంటూ సద్ది నివేదనకు భక్తులు భారీగా తరలివచ్చారు. ప్రధానంగా రైతులు, తీర ప్రాంత ప్రజలు, మహిళలు అధిక సంఖ్యలో హాజరయ్యారు. కావలి పట్టణ ప్రజలతో పాటు చుట్టు పక్కల పలు గ్రామాల నుంచి భక్తులు అధిక సంఖ్యలో తరలిరావడంతో ఆలయ ప్రాంతం కిటకిటలాడింది. ఉదయం 8 గంటలకు అక్కమ్మబావి సెంటర్ నుంచి ముత్తైదువలు తప్పెట్లు, మేళతాళాలతో ఊరేగింపుగా అమ్మ వారికి సద్ది, పొంగళ్లు తీసుకువచ్చి సంప్రదాయబద్ధంగా నివేదించారు. మధ్యాహ్నం 3 గంటలకు అమ్మవారి దర్శనం అనంతరం పాపిరెడ్డి చెరువులో నిమజ్జనానికి వైభవంగా తరలించారు. తొలుత ఎమ్మెల్యే రామిరెడ్డి ప్రతాప్‌కుమార్‌రెడ్డి అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. అమ్మవారి ప్రతిమ నిమజ్జనంలో పాల్గొన్నారు.



నడివీధి పోలేరమ్మ ప్రతిమ నిమజ్జనానికి తరలిస్తున్న ఎమ్మెల్యే ప్రతాప్‌కుమార్‌రెడ్డి

ఎల్ఐసీ ఉద్యోగుల వాకౌట్ సమ్మె

ఆత్మకూరు: ఆత్మకూరు ఎల్ఐసీ ఉద్యోగులు గంట పాటు కార్యాలయంలో వాకౌట్ సమ్మె చేశారు. బుధవారం మధ్యాహ్నం భోజన సమయంలో 12.30 నుంచి 1.30 గంటల వరకు ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు. కేంద్ర ప్రభుత్వం ఎల్ఐసీలో వేతన సవరణ వెంటనే చేపట్టాలని, అన్ని తరగతుల ఉద్యోగాల రిక్రూట్‌మెంట్ చేయాలని డిమాండ్ చేశారు. యాజమాన్యం చెల్లించే కంట్రీబ్యూషన్ 10 శాతం నుంచి 14 శాతానికి పెంచాలని ఎల్ఐసీ ఉద్యోగులు డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో బీమా ఉద్యోగుల సంఘం అధ్యక్ష, కార్యదర్శులు ఎస్ శ్యామ్ ప్రభాకర్, ఏవీ రమణయ్య, టి రమేష్, రమాదేవి, ప్రవీణ, డి.రవికుమార్, ఏజెంటులు పాల్గొన్నారు.

మహిళలకు చీరల పంపిణీ

వరికుంటపాడు: సంక్రాంతిని పురస్కరించుకుని మండలంలోని రామాపురం పంచాయతీ కాకొల్లువారిపల్లె బీసీ, ఎస్టీ కాలనీల్లో బుధవారం మాధవరపు నాగేంద్ర మెమోరియల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో 150 మంది మహిళలకు ట్రస్ట్ సభ్యుడు ఏ వెంకటరత్నం చీరలను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో నాగయ్య, వేణు, వినోద్, రమేష్, తదితరులు పాల్గొన్నారు.

వికసిత్ భారత్ గ్రామసభ

వరికుంటపాడు: మండలంలోని జి.కొండారెడ్డిపల్లెలో బుధవారం వికసిత్ భారత్ సంకల్పయాత్ర గ్రామసభ జరిగింది. అధికారులు,నాయకులు కేంద్ర ప్రభుత్వం అందించే పథకాలపై అవగాహన కల్పించారు. కేంద్ర ప్రభుత్వం పేదల అభ్యున్నతికి ఎన్నో సంక్షేమ పథకాలు ప్రవేశపెట్టిందన్నారు.

నేడు డయల్ యువర్ డీఎం

ఉదయగిరి: ఉదయగిరి ఆర్టీసీ డిపోలో ప్రయాణికులు, ప్రజల సౌకర్యార్థం గురువారం డయల్ యువర్ ఆర్టీసీ డీఎం కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు డిపో మేనేజర్ ఎం.శ్రీనివాసరావు బుధవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఈ కార్యక్రమం ఉదయం 11 నుంచి 12 గంటల వరకు జరుగుతుందన్నారు. ఉదయగిరి ప్రాంత ప్రయాణికులు, ప్రజలు తమ విలువైన సూచనలు, సలహాలు, ఫిర్యాదులను సెల్ నంబర్ 9959225095లో సంప్రదించి తెలియజేయాలన్నారు. ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు.

ఆత్మకూరులో..

ఆత్మకూరురూరల్: ఆత్మకూరు ఆర్టీసీ డిపోలో గురువారం ఉదయం 11 గంటల నుంచి 12 గంటల వరకు డయల్ యువర్ ఆర్టీసీ డీఎం కార్యక్రమం నిర్వహిస్తున్నామని డిపో మేనేజరు కరీమున్నీసా బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆత్మకూరు ప్రాంత ప్రజలు, ప్రయాణికులు తమ సూచనలు, సలహాలను సెల్ 99592 25645 నంబరు ద్వారా తెలియజేయాలని ఆమె కోరారు.

ఈ నెల 15న రాష్ట్ర స్థాయి ఎడ్ల బండలాగుడు పోటీలు

జలదంకి: జలదంకి మండలం బ్రాహ్మణక్రాకలో ఈ నెల 15 న రాష్ట్రస్థాయి ఎడ్ల బండలాగుడు పోటీలు నిర్వహించనున్నట్లు బ్రాహ్మణక్రాక ఆర్గనైజింగ్ కమిటీ సభ్యులు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రతి ఏడాది సంక్రాంతి సందర్భంగా బ్రాహ్మణక్రాక శివాలయం వద్ద ఈ పోటీలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. పోటీల్లో విజేతలైన ఎడ్ల యజమానులకు ప్రథమ బహుమతి రూ.50 వేలు, ద్వితీయ బహుమతి రూ. 40 వేలు, తృతీయ బహుమతి రూ. 30 వేలు, నాలుగో బహుమతి రూ. 20 వేలు, ఐదో బహుమతి రూ.15 వేలు అందిస్తామన్నారు. పోటీల్లో పాల్గొన్న ప్రతి ఎడ్లకు ప్రోత్సాహక బహుమతి కింద రూ. 5 వేలు అందించనున్నట్లు తెలిపారు. ఆసక్తి ఉన్న ఎడ్ల యజమానులు వివరాలకు 9912870734 , 9966882969 నంబర్లలో సంప్రదించాలని కోరారు.

6,624 ఆరోగ్యశ్రీ కార్డుల మంజూరు

వరికుంటపాడు: మండలంలోని 12 గ్రామ సచివాలయాల పరిధిలో 6,624 ఆరోగ్యశ్రీ హెల్త్ కార్డులు మంజూరు అయ్యాయని మండల వైద్యాధికారిణి కరీష్మా బుధవారం తెలిపారు. ఏఎన్ఎం, వలంటీర్ల ద్వారా ఈకేవైసీ చేయించుకుని పంపిణీ చేస్తామన్నారు. మూడో విడతలో మండలానికి 508 కంటి అద్దాలు వచ్చాయని, గురువారం నుంచి పంపిణీ చేస్తామన్నారు.



కావలి: అల్లూరు వీధుల్లో నేత్రపర్వంగా సాగిన పోలేరమ్మ గ్రామోత్సవం

నేత్రపర్వం.. పోలేరమ్మ గ్రామోత్సవం

• భారీగా తరలివచ్చిన భక్తులతో కిటకిటలాడిన అల్లూరు
• అలరించిన సాంస్కృతిక కార్యక్రమాలు
• వైభవంగా ముగిసిన జాతర

కావలి/అల్లూరు: అల్లూరు గ్రామదేవత పోలేరమ్మ జాతర మంగళవారం రాత్రి నుంచి బుధవారం సాయంత్రం వరకు వైభవోపేతంగా సాగింది. అమ్మవారిని దర్శించుకునేందుకు జిల్లా నలుమూలల నుంచి తరలివచ్చిన భక్తులతో వీధులన్నీ కిటకిటలాడిపోయాయి. ఇసుక వేస్తే రాలనంతగా జనం నిండిపోవడంతో అమ్మవారి జాతర నెమ్మదిగా ముందుకు సాగింది. అల్లూరు వీధులన్నీ అమ్మవారి నామస్మరణతో మారుమోగిపోయాయి. మంగళవారం ఉదయం నుంచి సద్ది నివేదనలు, ప్రత్యేక పూజలు నిర్వహించారు. రాత్రి 12 గంటల నుంచి అమ్మవారి గ్రామోత్సవం ప్రారంభమైంది. పోలేరమ్మ తల్లిని ప్రత్యేక రథంపై ప్రతిష్టించారు. సుగంధ పరిమళభరిత పుష్పాలతో అలంకరించారు. జై పోలేరమ్మ నామస్మరణతో ప్రారంభమైన గ్రామోత్సవాన్ని అల్లూరుపేటలోని అన్ని వీధుల్లో కనుల పండువగా నిర్వహించారు. వీధివీధిలో ఊరేగిన అమ్మవారికి భక్తులు నైవేద్యాలు సమర్పించి, పూజలు నిర్వహిస్తూ తమ కోర్కెలను తీర్చాలని ప్రార్థించారు. గ్రామోత్సవం అనంతరం పోలేరమ్మ తల్లిని విగ్రహాన్ని ఆలయంలో యథా స్థానంలో ప్రతిష్టించారు. తొలుత రాజ్యసభ సభ్యుడు బీద మస్తాన్‌రావు, కావలి ఎమ్మెల్యే రామిరెడ్డి ప్రతాప్‌కుమార్‌రెడ్డి, ఆప్కాఫ్ చైర్మన్ కొండూరు అనిల్‌బాబు, తదితరులు అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఉత్సవ కార్యనిర్వాహకులు మన్నెమాల సుకుమార్‌రెడ్డి ముఖ్య అతిథులను సాదరంగా ఆహ్వానించి శాలువాలతో సత్కరించారు.



కావలి: అశ్వవాహనంపై భక్తులకు అభయప్రదానం చేస్తున్న అమ్మవారు

ఆకట్టుకున్న సాంస్కృతిక కార్యక్రమాలు

ప్రముఖ టీవీ నటులు, గాయకులతో ఏర్పాటు చేసిన సాంస్కృతిక కార్యక్రమాలు, బాణసంచా వెలుగులు భక్తులకు కనువిందు చేశాయి. మ్యూజికల్ నైట్, డీజే సౌండ్, కోలాటం, తెనాలి బ్యాండ్, తప్పెట్లు, వీరతాళ్లు, మంగళవాయిద్యాలు, సంప్రదాయ తపెట్లు తదితర కార్యక్రమాలు భక్తులను ఆకట్టుకున్నాయి. మ్యూజికల్ నైట్‌లో రాజ్యసభ సభ్యుడు బీద మస్తాన్‌రావు, ఎమ్మెల్యే రామిరెడ్డి ప్రతాప్‌కుమార్‌రెడ్డి కొద్ది సేపు తిలకించారు. జాతరను, గ్రామోత్సవాన్ని కార్యనిర్వాహకులు మన్నెమాల సుకుమార్‌రెడ్డి, మేడా రామకృష్ణారెడ్డి, ఆలయ ఈఓ చిట్టిబాబు, ఉత్సవ కమిటీ సభ్యులు, ఆలయ కమిటీ సభ్యులు, గ్రామ పెద్దలు ప్రతిష్టాత్మకంగా నిర్వహించారు.



కావలి: ప్రత్యేక పుష్పాలంకరణలో శోభాయమానంగా కనిపిస్తున్న అమ్మవారి ఆలయం



కావలి: ఉత్సవ కార్యనిర్వాహకుడు మన్నెమాల సుకుమార్ రెడ్డిని సత్కరిస్తున్న భక్తులు